క్లుప్తంగా

ఎన్టీపీసీతో బతుకులు బూడిద

రామగుండం: ఎన్టీపీసీ తొలి విద్యుత్ కేంద్రం స్థాపించి 40 ఏళ్లయినా.. ఆనాడు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, గడిచిన కాలంలో ఎన్టీపీసీతో మా బతుకులు బూడిదయ్యాయని, మరో నూతన విద్యుత్ కేంద్రం స్థాపనకు కసరత్తు చేస్తూ మరోమారు నిర్వాసితులను నమ్మించి మోసగించే కుట్రకు తెర లేపిందని భూనిర్వాసితులు ఆరోపిస్తున్నారు. ఎన్టీపీసీ నూతన విద్యుత్ కేంద్రం ఏర్పాటు అనుమతులు నిలిపివేయాలని అంతర్గాం తహసీల్దార్ తూమ్ రవీందర్‌పటేల్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. చిలుక ప్రసాద్, చిలుక రాజేశం, దువ్వాసి నర్సయ్య, డేగల నర్సయ్య, కొలాని శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

షీటీంపై అవగాహన సదస్సు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులకు సోమవారం షీటీం బృందం షీటీంపై అవగాహన కల్పించారు. షీటీం ఇన్‌చార్జి మల్లన్న మాట్లాడుతూ.. మహిళల భద్రత కోసం షీటీం పని చేస్తోందన్నారు. స్నేహలత, సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టింపు లేదు

ముత్తారం: ఖమ్మంపల్లిలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో సీసీ రోడ్లు, మెగా పార్కు నిర్మాణంలో రూ.లక్షల అవకతవకలు జరిగాయని మాజీ సర్పంచ్ సముద్రాల రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా పట్టించుకునేవారే లేరన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

సుల్తానాబాద్ రూరల్: కనుకుల గ్రామానికి చెందిన తుమ్మ ప్రసాద్(40) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 18న తన ద్విచక్ర వాహనంపై కనుకుల నుంచి సుల్తానాబాద్ వస్తుండగా.. సబ్ స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని కిందపడ్డాడు. గమనించిన స్థానికులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్, అక్కడి నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి కూమారుడు, కూతురున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళా సాధికారతపై అవగాహన

పాలకుర్తి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ దయా అరుణ పాల్గొని స్థానిక మహిళలనుద్దేశించి మాట్లాడారు. ఎంపీడీవో అల్లం పూర్ణచందర్ రావు, ఏపీవో కొంరయ్య, వీవోఏ లావణ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను దళితులకివ్వాలి

ఓదెల: మడక గ్రామంలోని ప్రభుత్వ భూములను దళితులకివ్వాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్యను కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి గొస్కె రాజేశం కోరారు. సోమవారం హైదరాబాద్‌లో వినతిపత్రం ఇచ్చారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్


ధర్మారం: ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ తండ్రి రత్నానాయక్ ఇటీవల మరణించగా.. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సోమవారం బంజేరుపల్లి గ్రామంలోని రూప్లానాయక్ నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, అజయ్, సోగాల తిరుపతి, అరిగే లింగయ్య, కాడే సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశంగౌడ్, దేవి జనార్ధన్, ఓరం చిరంజీవి, దేవి అఖిల్, బద్దం అజయ్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం

రామగిరి: పన్నూర్ పంచాయతీ సెంటినరి కాలనీ ఎస్‌టీ2-977లో నివాసముంటున్న మాదారపు కమల-కేశవరావుల పెద్ద కూతురు మమత(35) సోమవారం ఉదయం మృతిచెందింది. మమత నేత్రాలను దానం చేస్తే మరో ఇద్దరికి చూపు లభిస్తుందని తల్లిదండ్రులకు టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, లయన్స్ క్లబ్ డైరెక్టర్ ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి అవగాహన కల్పించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, కార్యదర్శి లింగమూర్తికి సమాచారమందించగా.. కరీంనగర్ నుంచి టెక్నీషియన్ సతీశ్ లయన్స్ క్లబ్ సెంటినరికాలనీ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు.

అర్హులైన వారందరికీ రేషన్ కార్డులివ్వాలి

ఓదెల: అర్హులైన వారందరికీ రేషన్ కార్డులివ్వాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కారెంగల శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఓదెలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.



భక్తిశ్రద్ధలతో పడునెట్టాంబడి

యైటింక్లయిన్‌కాలనీ: శ్రీఅయ్యప్పస్వామి ఉత్తర నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని యైటింక్లయిన్‌కాలనీ శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో పడునెట్టాంబడి ఘనంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగాచారి ఆధ్వర్యంలో 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేసి 18 పడులను వెలిగించారు.



చర్యలు తీసుకోవాలి

కమాన్‌పూర్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జెడ్పీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడిపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో నిరసన వ్యక్తం చేశారు. ఎంఈవో విజయ్‌కుమార్, గసిగంటి రమేశ్, మేరుగు రాజమౌళి, రజనీ వందన, లక్ష్మినారాయణ, సతీశ్ పాల్గొన్నారు.



క్షయను నిర్మూలిద్దాం

కాల్వశ్రీరాంపూర్: క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వైద్యాధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ నిర్మూలన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, శ్రీనివాస్, పీహెచ్‌ఎస్ భాగ్య, హెచ్ఈవో వినీత్ శ్రీనివాస్, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదోతరగతి ప్రవేశం పరీక్ష కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గతేడాది డిసెంబర్ నుంచి దరఖాస్తులను మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా 2025- 26 దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యాభ్యాసం అందించేందుకు గురుకులాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ఐదోతరగతి ప్రవేశ పరీక్షతోపాటు 6 ,7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈ నోటిఫికేషన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఆధార్ కార్డు ఉంటే దరఖాస్తు చేసుకునే అవకాశముండేది. ఈ ఏడాది నుంచి కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ముందే సమర్పించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో 5వతరగతి ఒకసారి మిగిలిపోయిన సీట్లకు మరో విడత దరఖాస్తులను ఆహ్వానించేది. ఈ ఏడాది అన్ని దరఖాస్తులను ఒకేసారి ఆహ్వానించి స్వీకరిస్తుండడంతో ఒకేసారి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

5 బాలికలు.. 2 బాలుర..

జిల్లావ్యాప్తంగా 5 బాలికల గురుకుల సంక్షేమ హాస్టల్ రెసిడెన్షియల్ స్కూళ్లున్నట్లు గర్రెపల్లి తెలంగాణ గురుకుల సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్ గిరిజ తెలిపారు. నందిమేడారం, మల్లాపూర్, గర్రెపల్లి, రామగుండం, జూలపల్లి బాలికల గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలుండగా.. బాలురకు మంథని, సుల్తానాబాద్ ఉన్నాయి.



గర్రెపల్లి గురుకుల పాఠశాల

స్థానికులకే అవకాశం

గురుకుల హాస్టల్‌లో స్థానికులకే అవకాశాలు అధికంగా ఇవ్వనున్నారు. స్థానికేతరులకు మిగిలిపోయిన సీట్లలో అవకాశం కల్పించనున్నట్లు ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు.

గడువు ఫిబ్రవరి 1

గతేడాది డిసెంబర్ 21 నుంచి ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల నుంచి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 1 చివరి తేదీగా ప్రకటించారు. ఫిబ్రవరి 23న ఎంట్రన్స్ అర్హత పరీక్ష నిర్వహించనున్నారు.

ఇవి తప్పనిసరి..

ఈ విద్యాసంవత్సరంలో గురుకులంలో ప్రవేశం పొందడానికి రెవెన్యూ కార్యాలయం నుంచి మీసేవ ద్వారా పొందిన కులం, ఆదాయం సమర్పించిన తర్వాతే దరఖాస్తును ఆన్‌లైన్ చేసే అవకాశాన్ని కల్పించింది. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఈడబ్ల్యూఎస్ కేటగిరికి చెందినవారు ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే.

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ నిరక్షరాస్యులుండడంతో.. విద్యార్థుల తల్లిదండ్రుల నంబర్లు స్వీకరించి ఫోన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆహ్వానిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలుపుతున్నారు.

జత చేయాల్సినవి..

ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్, జనన ధ్రువీకరణ పత్రం జత చేయాలి. ఆధార్ కార్డుతోపాటు సెల్ నంబర్‌కు ఓటీపీ రావడంతో ఆన్‌లైన్లో లాగిన్ కావడానికి అవకాశముంది. గ్రామీణ రూ.1.50లక్షలు, పట్టణ రూ.2లక్షల్లోపు వార్షిక ఆదాయముండాలి. కులం, ఆదాయం రెవెన్యూ కార్యాలయం నుంచి తీసుకొని పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జత చేసి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఐదోతరగతికి దరఖాస్తు చేసేవారు 1.9.2012 నుంచి 31.8.2016 మధ్యలో జన్మించి ఉండాలి.

దరఖాస్తు చేసుకోవాలి

అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. నాలుగోతరగతి పూర్తి చేసిన వారు ఐదోతరగతి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ ఏడాది ఐదోతరగతితోపాటు 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలి. మళ్లీ నోటిఫికేషన్లివ్వరు. తల్లిదండ్రులు గమనించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి.

– గిరిజ, ప్రిన్సిపాల్, గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, గర్రెపల్లి



పెద్దపల్లిరూరల్: సులభ్ కాంప్లెక్సులు, పబ్లిక్ టాయిలెట్లలో మూత్ర విసర్జన ఉచితంగా, మల విసర్జనకు చార్జీ వసూలు చేయడం అందరికీ తెలుసు. కానీ పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో మున్సిపల్ వారు నిర్మించిన సులభ్ కాంప్లెక్సులో మూత్ర విసర్జనకు సైతం రూ.5 వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని అడిగితే కాంట్రాక్టర్ వసూలు చేయమన్నాడని నిర్వాహకుడు అంటున్నాడని తెలిపారు. మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

గ్రామసభలపై దిశానిర్దేశం

రామగుండం: మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ప్రజాపాలన రెండు రోజుల గ్రామసభల నిర్వహణలో క్షేత్ర సిబ్బంది అనుసరించాల్సిన విధి విధానాలపై సోమవారం అంతర్గాం తహసీల్దార్ తూం రవీందర్‌పటేల్ ఆయన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో ఎంఏ అలీం తదితరులు హాజరయ్యారు.

పెద్దపల్లిరూరల్: ఈనెల 26 నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న పథకాల అమలు కోసం మంగళవారం నుంచి గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. 21న అప్పన్నపేట, పాలితం, కొత్తపల్లి, మూలసాల, చీకురాయి, రాంపల్లి, సబ్బితం, రాఘవాపూర్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మంథని: ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేసే 4 ప్రభుత్వ పథకాల్లో భాగంగా లబ్ధిదారుల ఎంపికకు మంగళవారం నుంచి మున్సిపల్, గ్రామాల్లో వార్డు, గ్రామసభలు నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. మంథని మున్సిపల్ పరిధిలోని 13 వార్డులు, మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో సభలు జరుగుతాయన్నారు.

జూలపల్లి: సంక్షేమ పథకాల అర్హుల ఎంపికకు మంగళవారం నుంచి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలుకుంట, చీమలపేట, నాగులపల్లె, కాచాపూర్, అబ్బాపూర్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించనున్నారు.



రామగుండం: సిబ్బందికి సూచనలు, సలహాలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పూర్ణచందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న ఎల్కలపల్లి, గుడిపల్లి, గుంటూరుపల్లి, కొత్తపల్లి, మారేడుపల్లి, రామారావుపల్లి, ఉండేడ, వేంనూర్, ఎల్కలపల్లిగేట్, 22న బామ్లానాయక్‌తండా, ఘనశ్యాందాస్‌నగర్, జయ్యారం, కన్నాల, ముంజంపల్లి, పాలకుర్తి, 23న బసంత్‌నగర్, ఈసాలతక్కళ్లపల్లి, కుక్కలగూడుర్, పుట్నూర్, రాణాపూర్ గ్రామాల్లో ఉంటాయన్నారు.

కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాల అర్హుల జాబితా తయారీ కోసం మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 21 నుంచి ప్రారంభిస్తున్న గ్రామసభల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో పలు ఆదేశాలు చేశారు.

సభ విజయవంతం చేయండి

గోదావరిఖనిటౌన్: వేల గొంతులు, లక్ష డప్పులు దండోర సాంస్కృతిక సభను విజయవంతం చేయాలని మాజీ శాసన సభ్యుడు కాసిపేట లింగయ్య పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పాల్గొనే ఈనెల 22న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే వేల గొంతులు.. లక్ష డప్పులు కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని సోమవారం స్థానిక శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు.

మంథని: వచ్చే నెల 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతులు.. లక్ష డబ్బుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్‌లాల్ కోరారు. సోమవారం గద్దలపల్లి గ్రామంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.

మహాసభలు జయప్రదం చేయండి

సుల్తానాబాద్: ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో జరగనున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎరవెల్లి ముత్యంరావు కోరారు. సోమవారం సుల్తానాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో పోస్టర్ ఆవిష్కరించారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

పెద్దపల్లిరూరల్: విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం సాగిస్తోందని జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం 4వ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు.

చెస్ పోటీల్లో ప్రతిభ



ఎలిగేడు: ఈనెల 19న ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ నిర్వహణలో జరిగిన ఓపెన్ చదరంగ పోటీల్లో ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన తాటిపల్లి విశాల్ సత్తాచాటాడు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణరావు చేతుల మీదుగా నగదు, ప్రశంసాపత్రం, పతకం అందుకున్నాడు.

స్కేటింగ్ పోటీలకు ఎంపిక



సుల్తానాబాద్: ఈనెల 21 నుంచి 23 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్కేటింగ్ పోటీలకు సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎం పికయ్యారని కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్ తెలిపారు.

యూనియన్ వార్షికోత్సవం

రామగుండం: రామగుండం రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆవిర్భవించి ఏడాదవుతున్న సందర్భంగా సోమవారం తొలి ప్రథమ వార్షిక వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించారు.

గ్రామాల్లో సర్వే పూర్తి

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతు భరోసా లబ్ధిదారుల సర్వే పూర్తయినట్లు ఏవో ఉమాపతి తెలిపారు. మండలంలో 72ఎకరాల7 గుంటలు సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించినట్లు చెప్పారు. తహసీల్దార్ బషీరొద్దీన్, ఏఈవోలు, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని 12 గ్రామాల్లో రేషన్ కార్డుల జారీపై అర్హులను గుర్తించేందుకు జాబితా ప్రకారంగా అధికారుల సర్వే పూర్తి కావచ్చినట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. ఎంపీవో అరిఫ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.




ఎలిగేడులో సర్వే చేస్తున్న ఏవో, ఏఈవోలు

సుల్తానాబాద్: రైతు భరోసా రైతులకు మాత్రమే అందేలా పకడ్బందీగా సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని పూసాల, శాస్త్రినగర్, పలు ప్రాంతాల్లో వ్యవసాయ అధికారులతో కలిసి సర్వేలో పాల్గొన్నారు. ఏఈవో స్వప్న పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గోదావరిఖని టూటౌన్ ఎస్సై సురేశ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సోమవారం గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి యైటింక్లయిన్ కాలనీ షిర్కేబస్ స్టాప్ చౌరస్తాలో టూటౌన్ సీఐ ప్రసాద్‌రావు ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పించారు.

పెద్దపల్లిరూరల్: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమావళిపై యువత అవగాహన పెంచుకోవాలని ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిలోని మదర్‌థెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. ఎస్ఐ జాహెద్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులున్నారు.



యైటింక్లయిన్‌కాలనీ: అవగాహన కల్పిస్తున్న టూటౌన్ పోలీసులు

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

సుల్తానాబాద్: స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని శ్రీవాణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా వలంటీర్ మహేశ్ అన్నారు. పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ కళాశాలలో వివేకానంద జయంతి వీక్లీ సెలబ్రేషన్‌లో భాగంగా నెహ్రూ యువ కేంద్రం, స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.

జూలపల్లి: వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని మోటివేషన్ స్పీకర్ ఆంజనేయులు అన్నారు. పెద్దపల్లి నెహ్రూ యువ కేంద్రం, వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సింగరేణి వార్తలు

సమీక్ష సమావేశం

గోదావరిఖని: పాఠశాల ప్రిన్సిపాళ్లతో ఆర్జీ–1 సింగరేణి అధికారులు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 26న జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలపై సమీక్ష జరిపారు.

చెత్త డంపింగ్ ప్రతిపాదన విరమించుకోవాలి

జ్యోతినగర్: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ శివారులోని మేడిపల్లి గ్రామ శివారులో చెత్త డంపింగ్ యార్డు కోసం స్థల ప్రతిపాదన వెంటనే విరమించుకోవాలని మూడు, ఐదో డివిజన్ల కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి సింగరేణి సంస్థను కోరారు. సోమవారం మేడిపల్లి శివారులో చెత్తను డంపింగ్ చేస్తున్న స్థలంలో వారు మాట్లాడారు. చెత్త డంపింగ్ స్థలాన్ని ఇతర ప్రాంతానికి మార్చాలని జిల్లా అడిషనల్ కలెక్టర్, సింగరేణి సంస్థ ఆర్జీ–1 జనరల్ మేనేజర్లకు వినతిపత్రాలు అందించామన్నారు. పర్యావరణ సామాజిక కార్యకర్త ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గనిలో ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

రామగిరి: గనిలో ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని, బాధ్యతలను తెలుసుకొని విధులు నిర్వహించాలని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఎంవీటీసీలో ఆర్జీ–3, ఏపీఏలో విధులు నిర్వహిస్తున్న ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లతోపాటు నూతనంగా విధుల్లో చేరిన 18 మంది జేఎంఈటీలకు 12 రోజులపాటు నిర్వహించిన శిక్షణ ముగింపు తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏరియా సేఫ్టీ అధికారి ఎం.రాంమోహన్, ప్రాజెక్టు అధికారి కొలిపాక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఏ గనిలో కాంట్రాక్టు పనులను త్వరగా ప్రారంభించాలని వెన్సర్ కంపెనీ ప్రతినిధులకు ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో వెన్సర్ కంపెనీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

కలెక్టర్‌కు సన్మానం

గోదావరిఖని/గోదావరిఖనిటౌన్: జార్ఖండ్ రాష్ట్రంలోని దుమ్కా కలెక్టర్ దొడ్డ ఆంజనేయులును సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక దుర్గానగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చిన సందర్భంగా దుర్గానగర్ కాలనీవాసులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. తూముల రాజేశ్వర్‌రావు, జక్కుల నారాయణ, అమరేందర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ఇంటర్నెట్ సౌకర్యం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ గ్రంథాలయానికి ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ గ్రంథాలయాన్ని సందర్శించారు. మహిళలు, పురుషులకు వేరువేరుగా గదులను ఏర్పాటు చేస్తామన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలో గ్రంథాలయానికి పక్కా భవనాన్ని ఆధునిక హంగులతో నిర్మిస్తామని అన్నయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సహకార సంఘంలో అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయాన్ని సందర్శించి రికార్డులు, పుస్తకాలు, పరిశీలించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా లక్ష్మణ్

రామగిరి: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా రత్నాపూర్ గ్రామానికి చెందిన కొండ లక్ష్మణ్ ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా కల్వచర్ల గ్రామానికి చెందిన తోట్ల రాజు నియామితులయ్యాడు.

దేహ దానానికి అంగీకారం

కోల్‌సిటీ: గోదావరిఖని జవహర్‌నగర్‌లో నివాసముంటూ సింగరేణిలోని ఆర్జీ–2 పరిధిలోని ఓసీపీ–3లో ఈపీ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఉల్లి మొగిలి తన మరణానంతరం శరీరాన్ని మెడికల్ కళాశాలకు దానం చేస్తానని నిర్ణయం తీసుకున్నారు. స్థానిక గాంధీచౌక్ చౌరస్తా సమీపంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు, ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న మొగిలి.. ప్రజా ఉద్యమాల కోసం కమ్యూనిస్టు పార్టీల ఎర్రజెండా నీడలో చేరి సోమవారానికి 45 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తన మరణానంతరం శరీరాన్ని మెడికల్ కళాశాలకు దానం చేస్తానని ప్రకటించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య అభినందించారు. అభినందన పత్రాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.లింగమూర్తి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, ప్రతినిధి పంజాల రఘుపతిగౌడ్ అందజేశారు. సీఐటీయూ ఆర్జీ–1 బ్రాంచ్ అధ్యక్షుడు ఆరెపెల్లి రాజమౌళి, రామన్న తదితరులు పాల్గొన్నారు.



మొగిలికి అభినందన పత్రం అందిస్తున్న ప్రతినిధులు

కరాటే శిక్షణ తరగతులు

జూలపల్లి: పెద్దాపూర్ ఆదర్శ విద్యాలయంలో విద్యార్థినులకు కరాటే శిక్షణను విద్యాలయ ప్రిన్సిపాల్ షాదుల్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 6 నుంచి 9వతరగతి విద్యార్థినులకు ప్రతిరోజు గంట శిక్షణ ఉంటుందన్నారు. కరాటే శిక్షకుడు సంకెన్ల లక్ష్మినర్సయ్య ఉన్నారు.